

కెరటం నా ఆదర్శం
లేచి పడుతున్నందుకు కాదు,
పడినా లేస్తున్నందుకు...

# Dr.PRK పవర్

పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్ళు తప్ప







సంపుటి : 01 సంచిక : 348 | శనివారం 26 సెప్టెంబర్ 2026 | పేజీలు : 4 | వెల : 4


## అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు, దళితులకు భూమి పంపిణీ నిర్ణయంపై సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు

డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ

**హనుమకొండ, సెప్టెంబర్ 25, పవర్ న్యూస్**





అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించడం, అర్హులైన దళితులకు భూమి పంపిణీ చేయాలనే నిర్ణయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలుపుతూ మాదిగ హక్కుల దండోరా, దళిత బహుజన సంఘాల ఆధ్వర్యంలో హనుమకొండ అంబేద్కర్ సర్కిల్‌లో కృతజ్ఞత కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి సీఎం నిర్ణయాన్ని స్వాగతించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు గా మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు రేగుంట సునీల్ మాదిగ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాదిగ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించడం దళిత కుటుంబాల భూ హక్కులు, ఆత్మగౌరవం, ఆర్థిక భద్రతకు ఎంతో కీలకమని అన్నారు. గత ప్రభుత్వాల కాలంలో వివిధ కారణాలతో దళిత కుటుం బాలకు భూములకు సంబంధించి ఏర్పడిన సమస్యలను సమగ్రంగా సమీక్షించి, అర్హులైన వారికి తిరిగి న్యాయం చేయాలని కోరారు. దళితుల భూములకు సంబంధించిన పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా పరిశీలించి, అన్యాయంగా ఇతరుల పేర్లకు మారినట్లు తేలిన భూములను అర్హులైన అసలు హక్కుదారులకు తిరిగి అందించే చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని కోరారు. అలాగే అసైన్‌మెంట్ యాక్ట్--1977 ప్రకారం మోర్టేజ్ లోన్స్ పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో భూ సమస్యల పరిష్కారానికి చేపట్టిన చర్యలను గుర్తుచేసుకుంటూ, భూ హక్కుల పరిరక్షణకు ప్రస్తుత ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ధన్యవాదాలు తెలిపారు. రాజేందర్ సురేష్ బాబూరావు మాట్లాడుతూ దళితుల భూ హక్కులు, సామాజిక న్యాయం కోసం ప్రభుత్వం తీసుకునే చర్యలకు తమ మద్దతు ఉంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో చుంచు రాజేందర్, మాదాసు సురేష్, మన్నే బాబురావు, రామచందర్, కేడేల ప్రసాద్, స్వామి, మందవీరస్వామి, రవీందర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.





## సీఎం రేవంత్ రెడ్డికి 'ఆర్యదాన్ మొహమ్మద్' ఉత్తమ ప్రజాసేవ అవార్డు

- కేరళలోని నీలంబూరులో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చేతుల మీదుగా అవార్డు
- తెలంగాణలో సంక్షేమ పథకాలకు గుర్తింపుగా ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వెల్లడి

**హైదరాబాద్, పవర్ న్యూస్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్ఠాత్మక 'ఆర్యదాన్ మొహమ్మద్ ఉత్తమ ప్రజాసేవ పురస్కారం-2026' అందుకున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కేరళ మాజీ మంత్రి దివంగత ఆర్యదాన్ మొహమ్మద్ నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం కేరళలోని నీలంబూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని స్వీకరించారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చేతుల మీదుగా రేవంత్ రెడ్డి ఈ అవార్డును అందుకున్నారు. తెలంగాణలో రైతులు, బడుగు బలహీన వర్గాలు, సామాన్య ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రేవంత్ రెడ్డి నాయకత్వ పటిమ, ప్రజాస్వామ్య విలువల పట్ల ఉన్న నిబద్ధతను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు

మిగతా 2లో



## హైదరాబాద్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహం..

**ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి**

- హైదరాబాద్ గచ్చిబౌలిలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ విగ్రహం ఏర్పాటు
- ఆయన జయంతి సందర్భంగా శనివారం ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి
- ఆయన నాయకత్వంలోనే ఉపాధి హామీ, ఆర్టీఐ వంటి చట్టాలు వచ్చాయని వెల్లడి
- తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో మన్మోహన్ పాత్ర చారిత్రాత్మకమని కొనియాడిన ప్రభుత్వం

2

## గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి...

- ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం
- హుస్సేన్‌సాగర్‌లో ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం పూర్తి
- 69 అడుగుల పంచముఖ గణపతిగా దర్శనమిచ్చిన విగ్రహం
- క్రేన్ నంబర్ 4 వద్ద మధ్యాహ్నం 2.15 గంటలకు నిమజ్జనం
- పటిష్ఠ బందోబస్తు నడుమ ప్రశాంతంగా ముగిసిన వేడుక



2



## ఓట్ల తొలగింపుపై బీజేపీ కుట్ర..

- మహేశ్‌కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు
- అర్హులైన ఓటర్లకూ నోటీసులిస్తున్నారని విమర్శ
- గతంలో పలుమార్లు ఓటు వేసిన వారినీ ఇబ్బంది పెడుతున్నారని ఆరోపణ
- సీఈసీ పదవి నుంచి జ్ఞానేశ్ కుమార్ తప్పుకోవాలని డిమాండ్
- అర్హులందరికీ ఓటు హక్కు ఉండాలన్న మహేశ్ గౌడ్

2

# రామప్పలో వారసత్వ నడకలో పాల్గొన్న మంత్రి సీతక్క

**(ములుగు -- పవర్, సెప్టెంబర్ 25)**

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని రామప్ప దేవాలయం వద్ద శుక్రవారం వారసత్వ నడక నిర్వహించారు. తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ధనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ములుగు జిల్లా కలెక్టర్ హేమంత్ భోర్కడే, ఎస్పీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్ పాల్గొన్నారు. డిజిటల్ ప్రణాళిక, కృత్రిమ మేధస్సుతో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం ఈ ఏడాది ప్రధాన ఇతివృత్తంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. రామప్ప దేవాలయ చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని ప్రజలకు తెలియజేస్తూ వారసత్వ సంపద పరిరక్షణపై అవగాహన కల్పించారు. వారసత్వ నడకలో విద్యార్థులు, అధికారులు, పర్యాటకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రామప్ప దేవాలయ విశిష్టత, చారిత్రక




నేపథ్యాన్ని తెలుసుకునేలా కార్యక్రమాన్ని నిర్వహించారు.

## సీఎం రేవంత్ రెడ్డికి 'ఆర్యదాన్ మొహమ్మద్' ఉత్తమ ప్రజాసేవ అవార్డు

మొదటిపేజీ తరువాయి

ఆర్యదాన్ మొహమ్మద్ ఫౌండేషన్ ప్రకటించింది. ఈ అవార్డు కింద లక్ష రూపాయల నగదు బహుమతి, ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేశారు. ఎంపీ బెన్నీ బెహనాన్, కేరళ మంత్రి ఏపీ అనిల్ కుమార్, ప్రముఖ మేధావి కల్పేట నారాయణన్ సభ్యులుగా ఉన్న జ్యూరీ రేవంత్ రెడ్డిని ఈ పురస్కారానికి ఎంపిక చేసింది.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు లౌకిక శక్తులన్నీ ఏకం కావాలని పిలుపునిచ్చారు. మతతత్వ శక్తులను వ్యతిరేకించడమే ఆర్యదాన్ మొహమ్మద్‌కు అసలైన నివాళి అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశంలో ఓట్ల దొంగతనం, పార్టీల దొంగతనం, నిధుల దొంగతనం జరుగుతోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం దేశ యువత భవిష్యత్తును దొంగిలిస్తోందని విమర్శించిన ఆయన, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాజ్యాంగ వ్యతిరేక శక్తులను ఓడించాలని ప్రజలను కోరారు.

రాహుల్ గాంధీ తదుపరి భారత ప్రధాని అవుతారని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్తును నిర్దేశించే రాజకీయ పోరాటం "గాంధీ పరివార్", "సంఘ్ పరివార్" మధ్యే జరుగుతోందని ఆయన అభివర్ణించారు. ఆర్‌ఎస్‌ఎస్ మతం, కులం, ప్రాంతం, భాషల పేరుతో దేశాన్ని విచ్ఛిన్నం చేస్తోందని ఆయన తీవ్రంగా ఆరోపించారు. ఈ దేశం సంఘ్ పరివార్ వైపు ఉంటుందా లేక గాంధీ పరివార్ వైపు ఉంటుందా అనేది తేల్చుకోవాల్సిన సమయం వచ్చిందని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# హైదరాబాద్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహం.. రేపు ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, పవర్ న్యూస్**

మాజీ ప్రధానమంత్రి, ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. నగరంలోని ఐటీ కారిడార్ అయిన గచ్చిబౌలి విప్రో సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన ఈ కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం (సెప్టెంబరు 26) ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లను హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన్మోహన్ సింగ్ దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ విగ్రహం కేవలం ఒక స్మారక చిహ్నం కాదని, దేశ నిర్మాణంలో మన్మోహన్ సింగ్ పోషించిన పాత్ర, ఆయన ఆర్థిక దార్శనికత, నిస్వార్థ ప్రజాసేవ, నిరాడంబర నాయకత్వ లక్షణాలను భవిష్యత్ తరాలకు గుర్తుచేసే ఒక శాశ్వత ప్రతీక అని ఆయన అభివర్ణించారు.మన్మోహన్ సింగ్ పేరు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పొన్నం కొనియాడారు. 1991లో ఆర్థిక మంత్రిగా ఆయన ప్రారంభించిన సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థలో కీలక మార్పులకు బాటలు వేశాయని గుర్తుచేశారు. 2004 నుంచి 2014 వరకు ప్రధానమంత్రిగా దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం, ఆర్థిక స్థిరత్వం కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఆయన హయాంలోనే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం, విద్యా హక్కు చట్టం వంటివి అమల్లోకి వచ్చాయని తెలిపారు.

తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్ష అయిన ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో మన్మోహన్ సింగ్ కీలక పాత్ర పోషించారని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. 2009లో ప్రక్రియ ప్రారంభించాలని నాటి యూపీఏ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం నుంచి 2014లో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ద్వారా తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు కేంద్రంలో మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని ప్రభుత్వం చారిత్రాత్మక పాత్ర పోషించిందని ఆయన వివరించారు. రాష్ట్ర ఏర్పాటులో యూపీఏ ప్రభుత్వం, మన్మోహన్ సింగ్ పాత్రను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా గుర్తించిందని ఆయన తెలిపారు. ప్రధానిగా మన్మోహన్ సింగ్ మార్గదర్శకత్వంలో ఎంపీగా పనిచేయడం తన రాజకీయ జీవితంలో గర్వకారణమని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి...

**హైదరాబాద్, పవర్ న్యూస్**

హైదరాబాద్‌లోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన వేడుకలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఏడాది 69 అడుగుల ఎత్తుతో 'పంచముఖ సంకటహర మహాగణపతి'గా భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారి విగ్రహాన్ని వేలాది మంది భక్తుల జయజయధ్వానాల మధ్య హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేశారు.ఉదయం 9.30 గంటలకు ఖైరతాబాద్ నుంచి మహాగణపతి శోభాయాత్ర వైభవంగా ప్రారంభమైంది. యాత్ర ప్రారంభంలో దానం నాగేందర్ గణనాథుడి ఎదుట డ్యాన్స్ చేసి అందరిలో ఉత్సాహాన్ని నింపారు. 'గణపతి బప్పా మోరియా' అంటూ భక్తులు చేసిన నినాదాలతో పరిసర ప్రాంతాలన్నీ మార్మోగాయి. ఈ శోభాయాత్ర సెన్సేషన్ థియేటర్, రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మినార్, తెలంగాణ తల్లి చౌరస్తా మీదుగా ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకుంది.ఎన్టీఆర్ మార్గ్‌లో ఏర్పాటు చేసిన క్రేన్ నంబర్ 4 వద్దకు విగ్రహాన్ని చేర్చిన అనంతరం, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 2.15 గంటలకు భారీ క్రేన్ల సహాయంతో విగ్రహాన్ని సాగరంలో నిమజ్జనం చేశారు. తమ ఆరాధ్య దైవమైన గణనాథుడికి భక్తులు అశ్రు నయనాలతో ఘనంగా వీడ్కోలు పలికారు. పోలీసు యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిమజ్జన ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది.

## ఓట్ల తొలగింపుపై బీజేపీ కుట్ర..

**హైదరాబాద్, పవర్ న్యూస్**

అర్హులైన ఓటర్ల పేర్లను తొలగిస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. పౌరులకు నోటీసులు ఇచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. నిజామాబాద్‌లో గణేశ్ నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ డిమాండ్ చేసినట్టుగా ఎన్నికల సంఘం ప్రధాన అధికారి వెంటనే పదవి నుంచి తప్పుకోవాలని అన్నారు. లేకపోతే వారిని ప్రభుత్వం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ దేశంలో పుట్టిన పౌరులకు, గతంలో పలుమార్లు ఓటు వేసిన వారికి కూడా నోటీసులు ఇస్తూ ఇబ్బంది పెడుతున్నారని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా చూడాలని అన్నారు.నిజామాబాద్‌లో గణేశ్ నిమజ్జనం అతిపెద్ద పండుగల్లో ఒకటని మహేశ్ కుమార్ చెప్పారు. గణనాథుడిని సాగనంపుతూ రాష్ట్రం వ్యవసాయం, ఆరోగ్యం, విద్య సహా అన్ని రంగాల్లో ముందుకు సాగాలని కోరుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు పూర్తిగా అందాలని ఆకాంక్షించారు. మరోసారి ప్రజల ఆశీర్వాదం కాంగ్రెస్‌కు ఉండాలని కోరుకున్నామని చెప్పారు.




## ఒత్తిడి లేకుండా ఆరోగ్యంగా ఉండేందుకు యోగ దోహదం: హనుమకొండ అదనపు కలెక్టర్ ఎన్. రవి

**( హనుమకొండ -- పవర్, సెప్టెంబర్ 25)**

ఆరోగ్య ప్రయోజనాల కోసం ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ యోగ సాధన చేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్, పర్యాటక శాఖ నోడల్ అధికారి ఎన్. రవి సూచించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో యోగ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎన్. రవి అధికారులు, యోగా సాధకులు, విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. ప్రతిరోజూ యోగ సాధన చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని, ఆధునిక జీవనశైలిలో ఒత్తిడిని తగ్గించేందుకు యోగ దోహదపడుతుందని తెలిపారు. యోగ ప్రయోజనాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఆయుష్ శాఖ అధికారులు, సిబ్బంది, వాలంటీర్లు, యోగ సాధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**(వర్ధన్నపేట -- పవర్, సెప్టెంబర్ 25)**

వర్ధన్నపేట నియోజకవర్గంలోని 2వ డివిజన్ గుండ్లసింగారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమంలో భాగంగా నూతనంగా నిర్మించిన గృహాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ప్రారంభించారు. రెండో డివిజన్ పరిధిలోని గుండ్లసింగారంలో మాదాసి దయాకర్, సుజాత దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తికావడంతో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు స్వయంగా వెళ్లి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన ఇంటిని ప్రారంభించి, దయాకర్, సుజాత దంపతులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఇంటిలో వారు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భట్టు కరుణాకర్ కుమార్తె వేడుకకు హాజరైన ములుగు డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్

**(భూపాలపల్లి -- పవర్, సెప్టెంబర్ 25)**



భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భట్టు కరుణాకర్ గారి కూతురు నూతన వస్త్ర పుష్పాలంకరణ కార్యక్రమానికి ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ గారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు వేడుకలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు స్టేట్ కార్పొరేషన్ చైర్మన్ ఐతే ప్రకాష్ రెడ్డి, ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, కిసాన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, బీఎస్ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మారెం సుమన్ రెడ్డి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి, జిల్లా సీనియర్ నాయకులు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త పత్తి కొనుగోళ్లకు శ్రీకారం

- వరంగల్ మార్కెట్ యార్డులో తొలి బస్తాకు రూ.8775 ధర
- ఎం.వి.తండా రైతు జి.రమణకు సన్మానం
- మార్కెట్ యార్డును పరిశీలించిన సీపీ ఎన్.శ్వేత



(వరంగల్ -- పవర్, సెప్టెంబర్ 25)

వ్యవసాయ మార్కెట్ కమిటీ వరంగల్ పత్తి యార్డులో కొత్త పత్తి ప్రైవేట్ కొనుగోళ్లకు గురువారం శ్రీకారం చుట్టారు. ఉదయం 9 గంటలకు నిర్వహించిన ముహూర్త కార్యక్రమంలో జెండా పాట నిర్వహించి తొలి పత్తి బస్తాకు రూ.8775 ధర నిర్ణయించారు. నల్లబెల్లి మండలం ఎం.వి.తండాకు చెందిన రైతు జి.రమణ తీసుకొచ్చిన పత్తికి ఈ ధర పలికింది. దీంతో రైతును చైర్మన్, పాలకవర్గ సభ్యులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు శాలువాతో సన్మానించారు.అనంతరం మధ్యాహ్నం వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత మార్కెట్ యార్డును సందర్శించారు. యార్డులో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, వాటి పనితీరును పరిశీలించారు. మార్కెట్‌కు వస్తున్న సరుకు రకాలు, వాటి ధరలను అడిగి తెలుసుకున్నారు. సీజన్‌లో తలెత్తే శాంతిభద్రతల సమస్యలపై అధికారులను ఆరా తీశారు.ఈ కార్యక్రమంలో ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎన్.శ్రీనివాస్, వైస్‌చైర్మన్ బండి జనార్దన్, కమిటీ సభ్యులు గజ్జల శ్యాం, దుగ్యాల గోపాల్‌రావు, కందుకూరి పూర్ణచందర్, ఛాంబర్ అధ్యక్షుడు బొమ్మనేని రవీందర్‌రెడ్డి, కార్యదర్శి మడురి వేదప్రకాష్, కాటన్ అధ్యక్ష, కార్యదర్శులు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

# భూపాలపల్లిలో గణేష్ నిమజ్జన శోభాయాత్రకు ఘన స్వాగతం

వరంగల్ అభివృద్ధికి కేంద్ర నిధులు, సంస్థలు మంజూరు చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి

-కాకతీయ యూనివర్సిటీకి పీఎం-ఉషా నిధుల విడుదలకు విజ్ఞప్తి

-వరంగల్ కోట మ్యూజియం అభివృద్ధికి రూ.10 కోట్లు కోరిన ఎంపీ

-వరంగల్‌లో నైలెట్ (NIELIT), సీఐటీడీ (CITD) కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు

-పూర్తిస్థాయి పాస్‌పోర్ట్ సేవా కేంద్రం (శాఖ) ఏర్పాటు చేయాలని కోరిక

-ఎంపీ విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



(హైదరాబాద్/వరంగల్ -- పవర్, సెప్టెంబర్ 25)

వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పలు కీలక అభివృద్ధి పనులు, కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశాలపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య శుక్రవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రాలు అందజేశారు. వరంగల్‌కు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, మంజూరు కావలసిన కీలక సంస్థలపై కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి తగిన చొరవ చూపాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని ఆమె అభ్యర్థించారు.

**కాకతీయ యూనివర్సిటీకి పీఎం-ఉషా నిధులు**

కాకతీయ విశ్వవిద్యాలయంలో విద్యా, పరిశోధన, మౌలిక వసతులను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులు, పరిశోధకులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు పీఎం-ఉషా పథకం కింద ప్రతిపాదించిన నిధులను కేంద్రం నుంచి త్వరగా మంజూరు చేయించి విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డిని ఎంపీ కోరారు.

**పురావస్తు మ్యూజియానికి రూ.10 కోట్లు**

వరంగల్ కోటలోని పురావస్తు మ్యూజియం అభివృద్ధికి కేంద్ర సాంస్కృతిక శాఖ నుంచి రూ.10 కోట్లు మంజూరు చేయించేలా కేంద్రంతో మాట్లాడాలని కోరారు. 1991లో ఏర్పాటు చేసిన పాత మ్యూజియం భవనం శిథిలావస్థకు చేరగా, కొత్త భవన నిర్మాణం పూర్తయినప్పటికీ కళాఖండాల తరలింపు, పరిరక్షణ, భద్రత, వాతావరణ నియంత్రణ పనులు చేపట్టాల్సి ఉందని వివరించారు. 2026--31 సవరించిన మార్గదర్శకాల ప్రకారం ప్రతిపాదనలు సమర్పించేలా రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

**నైలెట్ (NIELIT), సీఐటీడీ (CITD) కేంద్రాల ఏర్పాటు**

ప్రస్తుతం హైదరాబాద్‌లోనే ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (NIELIT) కేంద్రాన్ని వరంగల్‌లో కూడా ఏర్పాటు చేస్తే స్థానిక యువతకు ఐటీ, ఏఐ, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లో శిక్షణ లభిస్తుందని తెలిపారు. అలాగే సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (CITD) కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ద్వారా ఇంజినీరింగ్, ఐటీఐ విద్యార్థులకు టూల్ డిజైన్, రోబోటిక్స్, 3డీ ప్రింటింగ్ వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో శిక్షణ అందుతుందని, కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖతో సంప్రదింపులు జరపాలని కోరారు.

**పూర్తిస్థాయి పాస్‌పోర్ట్ సేవా కేంద్రం (PSK)**

వరంగల్‌లో ప్రస్తుతం ఉన్న పోస్టాఫీస్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం (శాఖ) స్థానంలో పూర్తిస్థాయి పాస్‌పోర్ట్ సేవా కేంద్రం (PSK) ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. తత్కాల్ పాస్‌పోర్ట్ సేవల కోసం ప్రజలు కరీంనగర్, సికింద్రాబాద్ వెళ్లాల్సి వస్తోందని, త్రినగర ప్రాంతంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల సౌకర్యార్థం కేంద్ర విదేశాంగ శాఖతో మాట్లాడి పూర్తిస్థాయి కేంద్రం మంజూరు చేయించాలని కోరారు.ఇదే క్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి తమ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

**సీఎం రేవంత్ రెడ్డి సానుకూల స్పందన**

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ప్రస్తావించిన అన్ని అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఆయా ప్రతిపాదనలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించి, కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీకి హామీ ఇచ్చారు.

## సందీప్ కుమార్, రాధిక దంపతుల కుమార్తె ప్రహర్వికి జన్మదిన శుభాకాంక్షలు



(పసరగొండ -- పవర్, సెప్టెంబర్ 25)

దామెర మండలం పసరగొండ గ్రామంలో సందీప్ కుమార్, రాధిక దంపతుల కూతురు ప్రహర్వి మొదటి పుట్టినరోజు వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు చిన్నారి తాత, నానమ్మలైన గాంద్రతి కుమారస్వామి, రామదేవి దంపతులతో పాటు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఉత్సాహంగా పాల్గొని చిన్నారి ప్రహర్విని ఆశీర్వదించారు. పుట్టినరోజు వేడుకల సందర్భంగా గ్రామంలో సందడి నెలకొంది. హాజరైన వారందరూ చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలో స్థానిక బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎనుమాముల మార్కెట్లో శాంతి భద్రతలపై పోలీసు కమిషనర్ శ్వేతను కలిసి వివరించిన మార్కెట్ చైర్‌పర్సన్ పులి ప్రియాంక



(వరంగల్ -- పవర్, సెప్టెంబర్ 25)

వరంగల్ నగరంలోని ప్రసిద్ధ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో నెలకొన్న శాంతి భద్రతల అంశాలపై పోలీసు కమిషనర్ శ్వేతను మార్కెట్ చైర్‌పర్సన్ పులి ప్రియాంక మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మార్కెట్ పరిధిలో భద్రతా ఏర్పాట్లు, రైతులు మరియు వ్యాపారులకు సంబంధించిన వివిధ అంశాలను సీపీకి చైర్‌పర్సన్ వివరించినట్లు సమాచారం. మార్కెట్ ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ సహకారం అందించాలని వారు చర్చించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు మరియు మార్కెట్ వర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్



(వర్ధన్నపేట -- పవర్, సెప్టెంబర్ 25)

హనుమకొండ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ జవహర్ కాలనీలో శుక్రవారం ఘోర అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానిక నివాసి భూక్య బద్రుకు చెందిన శ్రీ సరస్వతి ఎంటర్‌ప్రైజెస్, శ్రీ సరస్వతి హార్డ్‌వేర్ అండ్ పెయింట్స్ షాపుల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగి షాపులు పూర్తిగా కాలిపోయాయి.ఈ విషయం తెలుసుకున్న వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ వెంటనే ఘటన స్థలానికి చేరుకుని ప్రమాద దృశ్యాలను పరిశీలించారు. బాధితుడు భూక్య బద్రు, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అగ్నిప్రమాదంలో జరిగిన ఆస్తి నష్టం వివరాలను అడిగి తెలుసుకున్న ఆయన, బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# తాళ్ల మల్లేశం మృతి విద్యా రంగానికి తీరనిలోటు

## ఈగ మల్లేశం

(గిర్మాజీపేట -- పవర్, సెప్టెంబర్ 25)
వరంగల్ పట్టణం గిర్మాజీపేటలోని తాళ్ల పద్మావతి విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్, ప్రముఖ విద్యావేత్త తాళ్ల మల్లేశం (73) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకుని అఖిల భారత పద్మశాలి సంఘం పూర్వ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం శుక్రవారం వారి స్వగృహానికి వెళ్లారు. మల్లేశం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం, తీవ్ర శోకసముద్రంలో ఉన్న వారి కుటుంబ సభ్యులను ఓదార్చి పరామర్శించారు. మల్లేశంతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ తన దిగ్భ్రాంతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఈగ మల్లేశం మాట్లాడుతూ... తాళ్ల మల్లేశం ఉమ్మడి వరంగల్ జిల్లా విద్యా రంగానికి చేసిన సేవలు అజరామరమని కొనియాడారు. 1981లో కేవలం 11 మంది విద్యార్థులతో 'లర్నర్స్ ల్యాండ్' పాఠశాలను ప్రారంభించి, అంచెలంచెలుగా ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల వరకు విద్యా సామ్రాజ్యాన్ని నిర్మించిన అసాధారణ వ్యక్తిత్వం ఆయనదని అన్నారు. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను



అందించడానికి ఆయన నిరంతరం తపించేవారని తెలిపారు. ఆయన మరణం జిల్లా విద్యా రంగానికి తీరని లోటని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ వద్నాల నరేందర్, పద్మశాలి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆడెపు రవీందర్, ప్రధాన కార్యదర్శి గోరంటాల రాజు, గుండు కామేశ్వర్, చిప్ప వెంకటేశ్వర్లు, గుండేటి సతీష్, రామ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు జయశ్రీ కుటుంబానికి న్యాయం చేయాలి

**- ప్రజా సంఘాల నేతల డిమాండ్**

**- బాధితురాలికి ఇల్లు ఆస్తులు ఇప్పించి రక్షణ కల్పించేందుకు సిపి ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టి సారించాలి**

(హనుమకొండ -- పవర్, సెప్టెంబర్ 25)
?అత్త మీరాబాయి చేత ఇంట్లో తాళం వేసి బంధించబడి నాలుగు రోజులుగా తిండి నిద్ర లేకుండా నరకయాతన అనుభవిస్తున్న హనుమకొండ రాంనగర్ కు చెందిన గూడూరు జయశ్రీ కుటుంబానికి వెంటనే న్యాయం చేయాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, ప్రజాసంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్, మహాత్మా జ్యోతిరావు పూలే సామాజిక న్యాయవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేడల ప్రసాద్ పటేల్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అంకెశ్వరపు రామచందర్ రావులు డిమాండ్ చేశారు. అత్త మీరాబాయి చేత బంధించబడి ఇంటిలోనే గూడూరు జయశ్రీ చేస్తున్న నిరసన శుక్రవారంతో నాలుగవ రోజుకు చేరిన సందర్భంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సంఘటన స్థలాన్ని సందర్శించి బాధితురాలికి మద్దతుగా ఇంటి ముందు నిరసన దీక్షలో పాల్గొని అండగా నిలిచారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నేతలు



మాట్లాడుతూ ఆమెను ఇంట్లో బంధించిన అత్త మీరాబాయిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో గూడూరు జయశ్రీకి తన అత్త మీరాబాయి నోటరీ డాక్యుమెంట్ ద్వారా రాసిచ్చిన ఇల్లుతో పాటు ఆమెకు రావాల్సిన ఆస్తులను వెంటనే ఇప్పించాలని కోరారు. జయశ్రీని ఆమె కూతురు తేజస్వినిని రక్షించేందుకు స్థానిక ఎమ్మెల్యే, సీపీ, జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కేయూ జేఏసీ చైర్మన్ డాక్టర్ మంద వీరాస్వామి, మాదిగ ప్రజాసమితి రాష్ట్ర అధ్యక్షుడు మేడ స్వామి మాదిగ, నాయకులు మోరే ఐలయ్య, గోల్కొండ శ్రీనివాస్, శ్రీరాం మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# గొర్రెల మేకల కాపరులకు యాభై ఏళ్లకే పింఛన్ ఇవ్వాలి

**ఆత్మకూరు ఎంపీడీవోకు వినతిపత్రం అందజేసిన గొర్రెల మేకల పెంపకందారుల సంఘం అధ్యక్షులు మిర్యాల కుమార్ యాదవ్**

(ఆత్మకూరు -- పవర్, సెప్టెంబర్ 25)
యాభై సంవత్సరాలు దాటిన గొర్రెల కాపరులకు చేయూత పెన్షన్ ఇవ్వాలని కోరుతూ స్థానిక ఎంపీడీవో ఎం. శ్రీనివాస రెడ్డికి ఆత్మకూరు గొర్రెల మేకల పెంపకందారుల సంఘం అధ్యక్షులు మిర్యాల కుమార్ యాదవ్ వినతిపత్రం అందజేశారు. గొర్రెల మేకల పెంపకందారులు సమాజానికి కల్తీ లేని బలవర్ధకమైన మాంసాన్ని అందిస్తున్నారని, వాటి మేత కోసం ఇరవై నుండి ముప్పై కిలోమీటర్ల వరకు నడుస్తూ అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆర్థిక స్తోమత లేక వైద్య ఖర్చులకు డబ్బులు అందక వృత్తి నిర్వహణలో తీవ్ర అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కల్లుగీత కార్మికులకు, చేనేత



కార్మికులకు ఇస్తున్నట్లుగానే యాభై సంవత్సరాలు దాటిన గొర్రెల మేకల పెంపకందారులు అందరికీ ప్రతినెల ఐదు వేల రూపాయల చొప్పున పింఛన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గొర్రెల మేకల పెంపకందారుల సంఘం కార్యదర్శి కాడబోయిన రమేష్ యాదవ్, సంఘ నాయకులు కాడబోయిన రవి, కాడబోయిన చిన్న రవి, మంత్రుర్తి సుమన్, తొగరు శేఖర్, కాడబోయిన మొగిలి తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్ట్ వనం భాస్కర్ భౌతికదేహానికి డీసీసీ అధ్యక్షుడు అయూబ్ నివాళులు

(వరంగల్ -- పవర్, సెప్టెంబర్ 25)
వరంగల్ తూర్పు నియోజకవర్గ విలేకరి వనం భాస్కర్ అకాల మరణం పట్ల వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న భాస్కర్ గురువారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఈ విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు అయూబ్ శుక్రవారం భాస్కర్ నివాసానికి వెళ్ళి ఆయన భౌతికదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రగాఢ సానుభూతి తెలిపారు. భాస్కర్ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాత్రికేయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని భాస్కర్‌కు నివాళులర్పించారు.

## గణేష్ నిమజ్జన ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్



(హసన్‌పర్తి -- పవర్, సెప్టెంబర్ 25)
హనుమకొండ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గం గ్రేటర్ వరంగల్ 66వ డివిజన్ హసన్‌పర్తి గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవస్థానంలో నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా చివరి రోజు నిమజ్జనం సందర్భంగా గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్న ప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా అరూరి రమేష్ మాట్లాడుతూ రేణుక ఎల్లమ్మ తల్లి గణపతి ఆశీస్సులతో హసన్‌పర్తి గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. గణపతి నిమజ్జనం భక్తులు యువత శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇనుగాల అమరేందర్‌రెడ్డికి ఘన నివాళి

(హైదరాబాద్ -- పవర్, సెప్టెంబర్ 25)
దివంగత ఇనగాల అమరేందర్‌రెడ్డి 24వ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి తండ్రి



అమరేందర్‌రెడ్డి 2002లో మృతి చెందారు. వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని వారి నివాసంలో కుటుంబ సభ్యులు సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అమరేందర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు ఆయన సేవలను స్మరించుకున్నారు.



# బ్లాక్ రోజ్‌తో శ్రుతిహాసన్

### స్టైలిష్ పోజులతో ఫొటో షూట్

సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే నటి శ్రుతిహాసన్.. తాజాగా షేర్ చేసిన ఫొటోలు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. విభిన్నమైన ఫ్యాషన్ లుక్స్‌తో పాటు తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను అభిమానులతో పంచుకునే ఈ అందాల భామ.. తాజాగా బ్లాక్ రోజ్‌తో ఫొటోషూట్ చేసింది. చేతిలో నల్ల గులాబీని పట్టుకుని శ్రుతిహాసన్ ఇచ్చిన స్టైలిష్ పోజులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నలుపు రంగు దుస్తుల్లో ఆమె మరింత గ్లామరస్‌గా కనిపించడంతో ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. బ్లాక్ రోజ్‌తో శ్రుతి ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్స్, ఆమె స్టైలిష్ లుక్ అభిమానులను ఫిదా చేస్తున్నాయి.ఎప్పటికప్పుడు కొత్త లుక్స్‌తో ప్రయోగాలు చేసే శ్రుతిహాసన్.. ఈసారి కూడా తనదైన స్టైల్‌తో ఆకట్టుకుంది. సింపుల్‌గా కనిపిస్తూనే ఫొటోలకు ఫ్యాషన్ టచ్ ఇచ్చిన ఆమెను చూసి నెటిజన్లు ప్రశంసలతో కామెంట్లు చేస్తున్నారు. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా సోషల్ మీడియాలో మాత్రం శ్రుతిహాసన్ తన అభిమానులకు ఎప్పటికప్పుడు టచ్‌లోనే ఉంటుంది. ఆమె తాజాగా పోస్ట్ చేసిన బ్లాక్ రోజ్ ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి.





# పురాణాల్లో సైన్స్ ఫిక్షన్‌కు అద్భుతమైన అంశాలు

### 'కల్కి 2898 ఏడీ' తొలి అడుగు మాత్రమే: నాగ్ అశ్విన్

భారతీయ పురాణాల్లో సైన్స్ ఫిక్షన్ కథలకు కావాల్సిన అద్భుతమైన అంశాలు ఎన్నో ఉన్నాయని దర్శకుడు నాగ్ అశ్విన్ అన్నారు. 'కల్కి 2898 ఏడీ' వాటిని తెరపైకి తీసుకురావడంలో తొలి అడుగు మాత్రమేనని చెప్పారు. ఈ సినిమా విజయంతో మరింత భారీ స్థాయిలో, కొత్త తరహాలో పురాణ కథలను చెప్పేందుకు సినీ పరిశ్రమకు నమ్మకం వచ్చిందని తెలిపారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో 2024లో విడుదలైన 'కల్కి 2898 ఏడీ' ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందింది. తాజాగా 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో బెస్ట్ పాపులర్ ఫిల్మ్ ప్రొవైడింగ్ హోల్‌సమ్ ఎంటర్‌టైన్‌మెంట్, బెస్ట్ స్పెషల్ ఎఫెక్ట్స్ విభాగాల్లో పురస్కారాలను సొంతం చేసుకుంది. భారతీయ పురాణాల్లో కాలం, అమరత్వం, వినాశనం, పునర్జన్మతో పాటు అత్యాధునిక ప్రపంచాలకు సంబంధించిన ఎన్నో ఆసక్తికరమైన ఆలోచనలు ఉన్నాయని నాగ్ అశ్విన్ చెప్పారు. వాటిని సైన్స్ ఫిక్షన్ కథలుగా మలిచేందుకు అపారమైన అవకాశం ఉందన్నారు. 'మన పురాణాల్లోని సైన్స్ ఫిక్షన్ అవకాశాలను ఇంకా పూర్తిగా ఉపయోగించుకోలేదా?' అనే ప్రశ్నకు స్పందిస్తూ.. 'కల్కి 2898 ఏడీ' కేవలం ఆరంభం మాత్రమేనని చెప్పారు. పురాణాల్లోని ప్రపంచాలు, భావనలు, ఆలోచనల నుంచి భవిష్యత్తులో మరెన్నో కథలు పుట్టుకొచ్చే అవకాశం ఉందన్నారు. భారీ స్థాయిలో ఇలాంటి కథలను తెరకెక్కించవచ్చని 'కల్కి 2898 ఏడీ' నిరూపించిందని నాగ్ అశ్విన్ పేర్కొన్నారు. ఈ సినిమా విజయంతో నిర్మాతలు, నటులు కూడా ప్రయోగాత్మకమైన, భారీ కాన్సెప్ట్‌లతో కూడిన కథలపై పెట్టుబడులు పెట్టేందుకు మరింత ధైర్యం చేస్తారని చెప్పారు.





# వినాయకుడి చెంత సారా అలీఖాన్

### ట్రెడిషనల్ డ్రస్ లో వినమ్రత

పటౌడీ వంశానికి చెందిన సైఫ్ అలీఖాన్ కుటుంబానికి బాలీవుడ్‌లో ప్రత్యేక గౌరవ ప్రతిష్ఠలు ఉన్నాయి. అలాంటి ప్రముఖ కుటుంబం నుంచి వచ్చిన వారసురాలు అయినప్పటికీ నటి సారా అలీఖాన్ తనలో ఎలాంటి గర్వం, హెడ్‌వెయిట్ కనిపించకుండా సింప్లిసిటీతో ఉంటారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే స్వభావం, అందరితోనూ ఆప్యాయంగా మెలిగే తీరు ఆమెకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. సెలబ్రిటీ హోదాను పక్కనపెట్టి సారా అలీఖాన్ చూపించే నిరాడంబరత తరచూ అభిమానులను ఆకట్టుకుంటుంది. తాజాగా టీసిరీస్ కార్యాలయంలో నిర్వహించిన గణపతి దర్శన్, పూజా కార్యక్రమంలోనూ ఆమె అదే వినమ్రతను చాటుకున్నారు. సంప్రదాయ వస్త్రధారణలో కార్యక్రమానికి హాజరైన సారా.. ఎలాంటి ఆడంబరాలకు తావివ్వకుండా భక్తిశ్రద్ధలతో గణనాథుడిని దర్శించుకున్నారు. స్వామివారికి నమస్కరిస్తూ సాధారణ భక్తురాలిలా కనిపించిన ఆమె తీరు అక్కడున్నవారిని ఆకట్టుకుంది. స్టార్ హోదా ఉన్నప్పటికీ దైవభక్తి, పండగ సంప్రదాయాలను పాటించడంలో సారా చూపిస్తున్న ఆసక్తి అభిమానులను మెప్పిస్తోంది. ఆమె తాజా గణపతి దర్శన్ ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో సందడి చేస్తున్నాయి.

# బ్లాక్ డ్రెస్‌లో ఫరియా అబ్దుల్లా..

### క్యూట్ స్మైల్ తో గ్లామర్ షో

టాలీవుడ్ యంగ్ బ్యూటీ ఫరియా అబ్దుల్లా సోషల్ మీడియాలో షేర్ చేసిన తాజా ఫొటోలు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. బ్లాక్ డ్రెస్‌లో స్టైలిష్‌గా కనిపించిన ఈ ముద్దుగుమ్మ.. తన క్యూట్ స్మైల్‌తో ఫొటోలకు మరింత అందాన్ని తీసుకొచ్చింది. సింపుల్ లుక్‌లోనే ఎంతో అందంగా కనిపిస్తూ ఫరియా ఇచ్చిన పోజులు అభిమానులను ఫిదా చేస్తున్నాయి. బ్లాక్ అవుట్‌ఫిట్‌కు తగ్గట్టుగా తనదైన స్టైల్‌లో కనిపించిన ఆమె.. చిరునవ్వుతో కెమెరాకు పోజులిచ్చింది. ఎప్పటికప్పుడు విభిన్నమైన లుక్స్‌తో అభిమానులను అలరించే ఫరియా.. ఈసారి కూడా తన ఫొటోషూట్‌తో ఆకట్టుకుంది. తాజాగా షేర్ చేసిన ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో నెటిజన్లు ఆమె అందాన్ని ప్రశంసిస్తూ కామెంట్లు చేస్తున్నారు.



# బీచ్‌సైడ్‌లో శ్రీలీల

### సూర్యాస్తమయ వేళ దేవకన్యలా మెరుపులు

టాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్, టాలెంటెడ్ బ్యూటీ శ్రీలీల తాజాగా షేర్ చేసిన బీచ్‌సైడ్ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. 'రోజ్ క్వార్ట్జ్ అవర్స్' పేరుతో ఆమె పంచుకున్న ఈ పిక్స్‌లో సంప్రదాయ చీరకట్టులో అచ్చం దేవకన్యలా మెరిసిపోతోంది. సముద్ర తీరాన సూర్యాస్తమయ వేళ ఆమె ఇచ్చిన రాయల్ పోజులు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. ఈ ఫోటోషూట్ కోసం శ్రీలీల షిమ్మరింగ్ పీచ్-రోజ్ పింక్ కలర్ ట్రెడిషనల్ ఎన్‌సెంబుల్‌ను ఎంచుకుంది. రోజ్ క్వార్ట్జ్ పింక్ జార్జెట్, ఆర్గాంజా చీరపై సిల్వర్ సీక్విన్స్ ఎంబ్రాయిడరీ, అందమైన బార్డర్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దీనికి జోడీగా స్వీట్‌హార్ట్ నెక్‌లైన్‌తో కూడిన హెవీ ఎంబ్రాయిడరీ బ్లౌజ్ ధరించింది. చీర కొంగును తలపై కప్పుకుని ఎంతో పద్ధతిగా కనిపించిన శ్రీలీల.. మాంగ్‌తిక్క, సున్నితమైన చెవి ఆభరణాలతో ఎథ్నిక్ లుక్‌ను మరింత అందంగా తీర్చిదిద్దింది. బీచ్ గోల్డెన్ అవర్ లైటింగ్‌కు తగ్గట్టుగా సాఫ్ట్ మేకప్ టోన్స్‌తో సహజమైన అందాన్ని మరింత హైలైట్ చేసింది. గాలికి ఎగురుతున్న చీర కొంగు, సముద్రపు అలల నేపథ్యం, శ్రీలీల చిలిపి చిరునవ్వు.. ఫొటోలకు మరింత అందాన్ని తీసుకొచ్చాయి. ప్రస్తుతం ఈ లేటెస్ట్ ఫోటోషూట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో అభిమానులు, నెటిజన్లు శ్రీలీల అందాన్ని ప్రశంసిస్తూ కామెంట్లు చేస్తున్నారు.